క్లుప్తంగా

శిలాఫలకం ధ్వంసంపై చర్యలు తీసుకోవాలి


ఎస్పీ అఖిల్ మహాజన్‌కు ఫిర్యాదు చేస్తున్న గంభీరావుపేట వాసులు

సిరిసిల్లటౌన్: అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన దుండగులపై చర్యలు తీసుకోవాలని గంభీరావుపేట మండలం కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ హమీద్ కోరారు. ఈమేరకు గురువారం సిరిసిల్లకు పార్టీ నేతలతో వచ్చి ఆయన ఎస్పీ అఖిల్ మహాజన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నవంబర్ 30న మండలంలోని గోరింట్యాల, రత్నగిరిపల్లె గ్రామాలను కలుపుతూ క్యాజ్‌వే నిర్మించడానికి ప్రభుత్వం నుంచి రూ.65లక్షలు విధించగా.. పనుల ప్రారంభానికి శిలాఫలకాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పనులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించగా..గురువారం ఉదయం గుర్తుతెలియని దుండగులు ఉద్దేశపూర్వకంగా పగులగొట్టారన్నారు. జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పర్శ హనుమాండ్లు, పిట్ల వెంకటి, అంజిరెడ్డి, పరశురాములు, ప్రసాద్ రావ, ప్రవీణ్, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


అక్షయను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి మోడల్ స్కూల్ పదో తరగతి విద్యార్థిని ఎం.అక్షయ జిల్లాస్థాయి గణిత ప్రతిభా పరీక్షల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మామిల్ల విఠల్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా అక్షయను ఉపాధ్యాయులు అభినందించారు. ఈనెల 18న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననుందని పేర్కొన్నారు. గణిత ఉపాధ్యాయురాలు రజిత, శ్రీనివాస్,మాధవి తదితరులు ఉన్నారు.

బీమా పరిహారం చెక్కు అందజేత



కోనరావుపేట: మండలంలోని మర్తనపేటకు చెందిన కస్ప భాను ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా బాధిత కుటుంబానికి రూ. 2 లక్షల బీమా పరిహారం చెక్కును అందించారు. ఇక్కడ బ్యాంక్ మేనేజర్ రఘునాథ శర్మ, కొలనూర్ సింగిల్‌విండో సీఈవో గాజుల రాజేశం, తదితరులున్నారు.

చందుర్తి ఎస్సైగా అంజయ్య



చందుర్తి: చందుర్తి ఎస్సైగా బొమ్మన అంజయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన చొక్కాల శ్రీకాంత్ మూడునెలల క్రితం ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేయగా అప్పటి నుంచి ఎస్సై పోస్టు ఖాళీగానే ఉంది. వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న అంజయ్య చందుర్తి ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



బోయినపల్లి: మండలకేంద్రంలోని కేజీబీవీ విద్యార్థులకు పీహెచ్‌సీ వైద్యాధికారి కార్తిక్ ఆధ్వర్యంలో గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా చలికాలంలో జలుబు, దగ్గు తదితర అలర్జీలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం ఉషారాణి తదితరులున్నారు.

అధికారుల తీరుపై మండిపాటు

చందుర్తి: మండలంలోని సనుగుల, బండపల్లి, చందుర్తి, మూడపల్లి తదితర గ్రామాలకు చెందిన రైతులతో జిల్లాలోని 24 మందిని 2021–22 ఆర్థిక సంవత్సరం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. వీరిలో 20 మందిని తీసుకుని పాడి గేదెలను ఎంపిక చేసుకోవడం, కొనుగోలు చేసేందుకు పశు వైద్యాధికారులతో పాటు ఎస్సీ కార్పొరేషన్ అధికారులతో గత వారం హర్యానాలోని రో టర్ జిల్లా ఖురానా డైయిరీ కేంద్రానికి తీసుకువెళ్లారు. అక్కడ నాలుగునెలల సూడి గేదెలను రూ.75వేలు చెప్పగా, ఇదే ధరకు అక్కడే లభ్యమవుతాయని లబ్ధిదారులు అధికారులను ప్రశ్నించారు. రెండ్రోజులుగా గేదెలను చూపిస్తామని కాలయాపన చేశారు. ఇక్కడ సూడి గేదెలు లభ్యం కావడం లేదని, కొనుగోలు చేయకుండానే ఇంటికి తీసుకువస్తున్నట్లు సనుగుల కు చెందిన రైతులు మోకనపల్లి కొండయ్య, గద్దరాసి రాజయ్య, బండపల్లికి చెందిన తిరుపతితో పాటు 17 మంది రైతులు ఆరోపించారు.

శివారులో సమస్యల తిష్ట

- చెత్త, మురుగుతో ఇబ్బంది
- వీధిదీపాలు లేక ఇక్కట్లు
- అలంకారప్రాయంగా వాటర్ ట్యాంక్
- కేసీఆర్‌నగర్, ఇందిరమ్మ కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి


కేసీఆర్‌కాలనీలో మురుగుకాలువలో ఉన్న బండరాళ్లు


కేసీఆర్‌నగర్ కాలనీ


ఇందిరమ్మ కాలనీలో రోడ్డుపక్కన చెత్త

ముస్తాబాద్: ముస్తాబాద్ శివారుకాలనీల్లో సమస్యలు తిష్టవేశాయి. నీటి సమస్య, మురుగునీటి వ్యవస్థ, చెత్త సమస్యతో కాలనీ ప్రజలు సతమతమవుతున్నారు. వీధిదీపాలు కొన్నిచోట్ల వెలగడం లేదు. రెండు కాలనీలకు కలిపి ఒకే బోరుమోటార్ ఉంది. అత్యవసర సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇందిరమ్మనగర్, కేసీఆర్‌నగర్‌లో అధికారులు సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

పదకొండు ఎకరాల్లో స్థలం కొనుగోలు

దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదలకు గూడు కల్పించాలన్న లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తీసుకొచ్చారు. 2007–08లో ముస్తాబాద్, మొర్రాయిపల్లె రోడ్డులో పదకొండు ఎకరాల ప్రైవేట్ స్థలాన్ని కొనుగోలు చేసి 300 ప్లాట్లు చేశారు. ఇందులో 120 మంది వరకు పట్టాలు అందించారు. చాలామంది ఇందిరమ్మ పథకంలో ఇళ్లు నిర్మించుకోగా, పలువురు సొంతంగా నిర్మించుకున్నారు. అప్పటినుంచే తాగు, నీటి సమస్యతోపాటు వీధిదీపాలు, విద్యుత్ సమస్య ఉండేది. క్రమేణ సమస్యలు తీరగా, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు ఇక్కడే డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇచ్చింది. 154 కుటుంబాలకు ఇళ్లు పంపిణీ చేయగా, ఇప్పుడు అక్కడ ఓ గ్రామం తయారైంది. దీంతో పాటు పారిశుధ్య, ఇతర సమస్యలు నెలకొన్నాయి.

కాలనీలో ఇవీ సమస్యలు..

- పదకొండు ఎకరాల్లో విస్తరించిన ఇందిరమ్మ, కేసీఆర్ కాలనీల్లో చెత్త సమస్య ఉంది. పంచాయతీ ట్రాక్టర్ పది రోజులకోసారి కూడా రావడం లేదని కాలనీ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయడంతో కాలనీ చెత్తమయంగా తయారైంది.
- కేసీఆర్‌నగర్‌లో కాలనీలో మురుగుకాల్వలు ఉన్నా పలుచోట్ల శుభ్రపరచడం లేదు. 10 నుంచి 15వ బ్లాక్ వరకు మురుగునీరు నిలవడంతో దుర్గంధం వెదజల్లుతోంది.
- కాలనీలో చివర ఉన్న రెండు బ్లాకుల ఇళ్లప్రజలు సెప్టిక్ ట్యాంక్‌తో ఇబ్బందులు పడుతున్నారు. సెప్టిక్ ట్యాంకుల వద్ద కనీస రక్షణ చర్యలు తీసుకోలేదని వాపోతున్నారు.
- కాలనీల్లో అక్కడక్కడ లైట్లు వెలగకపోవడంతో పలువురు చీకట్లో మగ్గుతున్నారు.
- ఇందిరమ్మ కాలనీలో 15ఏళ్ల క్రితం నిర్మించిన వాటర్‌ట్యాంక్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ ఎంపీ హోదాలో ప్రారంభించారు. ఇప్పుడు అలంకారప్రాయంగా ఉంది. డైరెక్ట్ పంపింగ్‌తో బోరు నీటిని సరఫరా చేస్తున్నారు. రక్షితనీరు కరువైంది. అంతా ప్యూరిఫైడ్ వాటర్‌ప్లాంట్‌నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు.

చెత్త పేరుకుపోతోంది



కేసీఆర్‌నగర్ కాలనీకి పారిశుధ్య వాహనాలు రావడం లేదు. కాలనీ చుట్టు పక్కల అంతా చెత్తతో నిండింది. రెగ్యులర్‌గా చెత్త బండ్లు వస్తే సమస్య తీరుతుంది. ఏడాది క్రితం రెగ్యులర్‌గా ట్రాక్టర్ వస్తుండే. ఇప్పటికైనా పంపించాలి. – గుణశేఖర్, కాలనీవాసి

వీధిలైట్లు వేయడం లేదు



కాలనీల్లో వీధిలైట్లు వేసేవారు కరువయ్యారు. మురుగునీటి సమస్య ఉంది. డ్రైనేజీలను శుభ్రం చేయడం లేదు. వీధిలైట్లు మా భర్తే రోజూ వేస్తున్నాడు. లేదంటే కాలనీ మొత్తం చీకటిమయమే. దోమల బెడద ఉంది. – బద్దిపడిగె నవీన, మాజీ వార్డు మెంబర్

సమస్యలు పరిష్కరిస్తాం



ఇందిరమ్మ, కేసీఆర్ నగర్ కాలనీల్లో సమస్యల పరిష్కారానికి కృషిచేస్తాం. ముఖ్యంగా చెత్త సమస్య ఎక్కువగా ఉందని తెలిసింది. నీటి సమస్య లేదు. వీధి లైట్లు సిబ్బందితో వేయిస్తాం. సమస్యలుంటే తెలపాలి. – బీర్ల బీరయ్య, ఎంపీవో

స్థానిక సంస్థల ఎన్నికలపై సమావేశం

తంగళ్లపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవో కే.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో అఖిల పక్ష నాయకులతో సమావేశం నిర్వహించారు. గ్రామపంచాయతీ ఎన్నికల ఓటర్ లిస్టు జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితా గురించి చర్చించారు. ఇప్పటికే అన్ని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో లిస్టును ప్రదర్శించినట్లు ఎంపీడీవో తెలిపారు. ఎంపీడీవో తోపాటు సూపరింటెండెంట్ దొంతుల రమేశ్, కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రవీణ్ జేటోని, బీజేపీ అధక్షుడు వెన్నమనేని శ్రీధర్ రావు, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, పలు పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ఎంపీడీవో బీరయ్య అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో ఉన్న 42 పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలను స్వీకరిస్తున్నామని ఎంపీడీవో తెలిపారు. ఆయా గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలపై ఏవైనా అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు ఉన్నట్‌లైతే ఫిర్యాదు చేయాలని కోరారు. పోలింగ్ కేంద్రాల నిర్వహణ, నిబంధనలపై అవగాహన కల్పించారు. నాయకులు నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలపరిషత్ కార్యాలయంలో మండల ముసాయిదా పోలింగ్‌స్టేషన్ల అభ్యంతరాలపై అన్ని పార్టీల ప్రతినిధులతో ఎంపీడీవో శశికళ సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు ఎండీ జమాల్, బీజేపీ మండల కన్వీనర్ దేశెట్టి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


ఇల్లంతకుంట : సమావేశమైన ఎంపీడీవో శశికళ


రుద్రంగి : సమావేశమైన అధికారులు

వీర్నపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అబ్దుల్ వాజిద్ స్థానిక సంస్థల ఎన్నికలు, పోలింగ్‌కేంద్రాలపై అవగాహన కల్పించారు. పలు పార్టీల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రుద్రంగి: మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పార్టీల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో ఎంపీడీవో నట్రాజ్ సమావేశం నిర్వహించారు. ఓటరు లిస్టు, పోలింగ్ స్టేషన్ వివరాలపై చర్చించారు. కార్యక్రమంలో పార్టీల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలకు డిజిటల్ బోర్డు బహూకరణ



తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా ప్రాజెక్ట్, ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూ.1.7 లక్షల విలువైన డిజిటల్ బోర్డును బహూకరించారు. ఈ డిజిటల్ బోర్డును సిరిసిల్ల ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి గురువారం ఆవిష్కరించారు. జిల్లా కోఆర్డినేటర్ రాజశేఖర్, తిరుపతి, బాబు, లక్ష్మణ్, సంగీత, రమ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులతో సమావేశం

బోయినపల్లి: మండలంలోని పలుగ్రామాల్లో రైతులు సాగుచేసిన ఆయిల్ పామ్ సాగులో 2025 సంవత్సరంలో 160 ఎకరాల్లో పంట దిగుబడి రావడం ప్రారంభమవుతుందని ఎంఏవో ప్రణీత, ఆయిల్ పామ్ కంపెనీ ప్రతినిధి శ్రీకాంత్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని రైతు వేదికలో ఆయిల్ పామ్ సాగు చేసే రైతులతో గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 256 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీదేవి, రైతులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందిస్తున్న ఉపాధ్యాయులు

గంభీరావుపేట: మండలంలోని భీమునిమల్లారెడ్డిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నభోజన కార్మికురాలిగా పనిచేస్తున్న వరలక్ష్మీ కుమారుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఉపాధ్యాయులు తలా కొంత పోగు చేసి గురువారం ప్రధానోపాధ్యాయుడు నర్సింగారావు చేతుల మీదుగా రూ. 10వేలు ఆర్థికసాయంగా ఆమెకు అందించారు. ఉపాధ్యాయులు శంకర్, కనుకయ్య, సత్యనారాయణ, రజని, లక్ష్మీనారాయణ, పుష్పలత, ప్రమీల, స్రవంతి, శ్రీనివాస్, మనోహర్ పాల్గొన్నారు.

'గోరుముద్ద' ప్రారంభం

కోనరావుపేట: మండలంలోని కొలనూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గోరుముద్ద కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయుడు శ్రీపతి శ్రీనివాస్, ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ వీరవేని తిరుపతియాదవ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. గోరుముద్ద కార్యక్రమానికి తిరుపతి యాదవ్ రూ.10 వేలు అందించడం అభినందనీయమన్నారు. గ్రామస్తులు పాఠశాల అభివృద్ధి కోసం సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు మెరుగు స్రవంతి, కాదాసు రాములు ప్రధానోపాధ్యాయుడు శ్రీపతి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్త పాలకవర్గంలో సమస్యలు తీరేనా?


వేములవాడ మార్కెట్ కమిటీ యార్డు

- వెలవెలబోతున్న వేములవాడ మార్కెట్ యార్డు
- ఐదేళ్లుగా కొనుగోళ్లు లేవ్.
- ఈనెల 22న కొత్త పాలకవర్గం ప్రమాణస్వీకారం

వేములవాడరూరల్: జిల్లాలో గ్రేడ్–1 మార్కెట్‌గా ఉన్న వేములవాడ మార్కెట్ కమిటీ యార్డు ధాన్యం, రైతులు లేక ఐదేళ్లుగా వెలవెలబోతోంది. ఈ మార్కెట్ కమిటీ కొన్నేళ్లుగా జిల్లాలోనే గ్రేడ్–1 మార్కెట్‌గా పేరుండి కోట్ల ఆదాయం ప్రభుత్వానికి సమకూరుస్తోంది. ఈ యార్డులో దాదాపు ఐదెకరాల స్థలం వరకు ఉంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రెండెకరాల ఎకరాల స్థలాన్ని వెజిటబుల్ మార్కెట్ కోసం కేటాయించారు. మిగతా మూడెకరాల స్థలంలో ధాన్యం కొనసాగించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు యార్డుకు రాకుండానే దళారులకు ధాన్యం విక్రయిస్తున్నారు. ధాన్యానికి సంబంధించిన మిషన్లు, షెడ్లు ఉన్నప్పటికీ అవి తుప్పుపట్టి పోతున్నాయి. నెల రోజుల క్రితం ఈ మార్కెట్ యార్డులో ఉన్న రెండు షెడ్లను టెస్కో యారన్ డిపో కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించింది. ఇదే కార్యాలయంలో ఏడీఏ కార్యాలయం కూడా కొనసాగుతున్నది. ప్రస్తుతం మార్కెట్ కమిటీలో నాలుగు కార్యాలయాలు కొనసాగుతున్నాయి. ఈ మార్కెట్ యార్డును విశాలమైన మార్కెట్ యార్డుగా ఏర్పాటు చేసేందుకు మర్రిపల్లిలో ప్రభుత్వం స్థలం కేటాయించింది. అక్కడ ఇప్పటివరకు ఎలాంటి పనులు జరగడం లేదు. 1971 నుంచి 1974 వరకు మొదటి చైర్మన్‌గా ఎస్.వెంకట్‌రెడ్డితో ప్రారంభమైన వేములవాడ మార్కెట్ కమిటీ 1989 జనవరి 26న పట్టణంలో విశాలమైన ప్రదేశంలో అప్పటి రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి రాజేశం గౌడ్‌తో సొంత కార్యాలయం ప్రారంభించారు. ఇప్పటివరకు దాదాపు 11 మంది మార్కెట్ కమిటీ చైర్మన్లు ఈ కార్యాలయంలో సేవలందించారు. 12వ చైర్మన్‌గా ప్రభుత్వం ఇటీవల నాగాయపల్లికి చెందిన రొండి రాజును నియమించింది.

కొత్త పాలకవర్గంపైనే ఆశలు..

వేములవాడ మార్కెట్ కమిటీ పరిస్థితి రోజురోజుకూ ఆదాయం తగ్గి రైతులు కూడా యార్డుకు రాక వెలవెలబోతోంది. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంతో కాంగ్రెస్ చైర్మన్లు పదవులు చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం మార్కెట్ కమిటీలకు మళ్లీ పునర్వైభవం తీసుకువస్తుందా..? అని రైతులు ఎదురుచూస్తున్నారు. 18 మంది సభ్యులతో ఏర్పాటు చేసిన ఈ కమిటీ ఈనెల 22న కొత్త పాలకవర్గం ప్రమాణస్వీకారం చేయనుంది. కొత్తపాలకవర్గం కొలువుదీరితే సమస్యలు పరిష్కారం అవుతాయని రైతులు భావిస్తున్నారు.



ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని మెయిన్ రోడ్డుతో పాటు పలు గ్రామాల్లో రోడ్ల పక్కన చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు తాకుతున్నాయి. ఒకదానికొకటి విద్యుత్ వైర్లు ఆనుకొని షార్ట్‌సర్క్యూట్ జరుగుతోంది. దీంతో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పలువురు వాపోతున్నారు. వెంటనే అధికారులు విద్యుత్ వైర్లకు చెట్ల కొమ్మలు తగలకుండా సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : పృథ్వీధర్, సెస్ ఏఈ, ఎల్లారెడ్డిపేట సెల్‌నంబర్ : 9440814081

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

యువత క్రీడల్లో రాణించాలి


వేములవాడరూరల్: గెలుపొందిన క్రీడాకారులతో అధికారులు


ఎల్లారెడ్డిపేటలో విజేతలకు బహుమతులు అందిస్తున్న అధికారులు, నాయకులు

వేములవాడరూరల్: ప్రభుత్వ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకొని క్రీడల్లోనూ రాణించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్ అన్నారు. గురువారం వేములవాడ రూరల్ మండలం నూకలమర్రిలో మండలస్థాయి సీఎం కప్ క్రీడల్లో గెలుపొందిన విజేతలకు సర్టిఫికెట్స్ ప్రదానం చేసిన అనంతరం మాట్లాడారు. గెలుపొందిన విజేతలను అభినందిస్తూ మండలానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, డైరెక్టర్ పాలకుర్తి పర్శరాం, తహసీల్దార్ సుజాత, మండల విద్యాధికారి కిషన్, ఎంపీడీఓ కే.శ్రీనివాస్, కార్యదర్శి రమ, ఫిజికల్ డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్ బేగం, ఏఎంసీ చైర్మన్ సాబేరా బేగం అన్నారు. మండలకేంద్రంలో సీఎం కప్ మండలస్థాయి పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఖోఖో మహిళా విభాగంలో అల్మాస్‌పూర్ జట్టు మొదటి స్థానం, రెండో స్థానంలో వెంకటాపూర్, ఖోఖో పురుషుల విభాగంలో మొదటి స్థానం రాచర్లబొప్పాపూర్ జట్టు, రెండో స్థానంలో బాకూర్‌పల్లి జట్లు రాణించాయి. కబడ్డీ మహిళల విభాగంలో మొదటి స్థానం అల్మాస్‌పూర్, రెండో స్థానంలో బొప్పాపూర్, పురుషుల విభాగంలో అల్మాస్‌పూర్ మొదటి, రెండో స్థానంలో రాచర్లగొల్లపల్లి జట్లు నిలిచాయి. వాలీబాల్ మహిళల విభాగంలో రాచర్లబొప్పాపూర్ మొదటి స్థానం, రెండో స్థానంలో అల్మాస్‌పూర్, పురుషుల విభాగంలో రాచర్లబొప్పాపూర్ మొదట, రెండో స్థానంలో హరిదాస్‌నగర్ జట్లు గెలుపొందాయి. గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. ఎంపీడీవో సత్తయ్య, తహసీల్దార్ రామచంద్రం, ఎంఈవో కృష్ణహరి, పీఈటీలు, పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు రోజులపాటు జరిగిన సీఎం కప్ క్రీడల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు గురువారం సిరిసిల్ల ఆర్డీవో, మండల స్పెషల్ అధికారి వెంకట ఉపేందర్ రెడ్డి బహుమతులు అందజేశారు. ఎంపీడీవో కే.లక్ష్మీనారాయణ, ఇన్‌చార్జి తహసీల్దార్ జయంత్ కుమార్, హెచ్ఎం శంకర్ నారయణ, ఏఎంసీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని గాలిపెల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి సీఎం కప్ క్రీడలు నిర్వహించారు. క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని జిల్లాస్థాయికి పంపనున్నట్లు ఎస్‌జీఎఫ్ మండల కన్వీనర్ సంపత్‌రావు తెలిపారు.

వీర్నపల్లి: మండలకేంద్రంలోని మోడల్ స్కూల్‌లో సీఎం కప్ మండలస్థాయి క్రీడాపోటీలు ముగిశాయి. తహసీల్దార్ మారుతి రెడ్డి, ఎంపీడీవో అబ్దుల్ వాజిద్ హాజరై మాట్లాడారు. కాగా, మండల వాలీబాల్ పోటీల్లో వీర్నపల్లి, కబడ్డీలో మద్దిమల్ల, ఖోఖోలో వీర్నపల్లి జట్లు గెలుపొందాయి. క్రీడాకారులకు బహుమతులు అందించారు. ఎంఈవో శ్రీనివాస్, ఎస్సై ఎల్లయ్యగౌడ్, పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● రెగ్యులరైజ్ చేయాలి

ముస్తాబాద్: సర్వశిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం బాధ్యుడు తుమ్మ రాజేందర్ ప్రభుత్వాన్ని కోరారు. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న ఉద్యోగులు, టీచర్లకు పే స్కేల్ ఇవ్వాలన్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచి ఆదుకోవాలన్నారు. సీఆర్‌పీలు, కంప్యూటర్ ఆపరేటర్లు, కస్తూర్బా టీచర్లు, బోధనేతన సిబ్బందిని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

● రెడ్డి సంఘం అధ్యక్షుడిగా రవీందర్‌రెడ్డి

బోయినపల్లి: మండలంలోని తడగొండ రెడ్డి సంఘం ఎన్నికలు గురువారం జరిగాయి. అధ్యక్షుడిగా గుడి రవీందర్‌రెడ్డి, కార్యదర్శిగా మిర్యాల సాకేత్ రెడ్డి, కోశాధికారిగా గోదల మనోహర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏకగ్రీవంగా ఎన్నుకున్న సంఘ సభ్యులకు నూతన అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

● డివైడర్‌ను ఢీ కొన్న లారీ

బోయినపల్లి: మండలంలోని వెంకట్రావుపల్లి రూసో కళాశాల పరిసరాల్లో గురువారం ఓ లారీ డివైడర్‌ను ఢీకొనడంతో డివైడర్ గోడలు కూలి ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ వైపు నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న లారీ రూసో కళాశాల పరిసర ప్రాంతంలోకి వెళ్లగానే ముందు టైర్ పంక్చర్ అయింది. దీంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. లారీ బోల్తా పడితే పను ప్రమాదం జరిగేందని స్థానికులు తెలిపారు.

సీసీ కెమెరా వితరణ

ఇల్లంతకుంట: వల్లంపట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలకు 20వేల విలువైన సీసీ కెమెరాను మాజీ సర్పంచ్ కట్ట అనసూయ రెడ్డి ప్రధానోపాధ్యాయుడికి అందజేశారు. కార్యక్రమంలో వెంకట నరసింహారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు దూస గోవర్ధన్, ప్రధానోపాధ్యాయుడు కటకం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

● ముగ్గురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. భాగంగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురిపై పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. సరైన ధ్రువపత్రాలు లేకుండా వాహనాలు నడుపుతున్న 10 ద్విచక్రవాహనాలకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్సై రమాకాంత్ మాట్లాడుతూ.. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కేసులునమోదు చేస్తామన్నారు.

● దొంగతనం కేసులో వ్యక్తి రిమాండ్

గంభీరావుపేట: మండలంలోని మల్లారెడ్డిపేటలో దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. గ్రామానికి చెందిన కందుకుల సుమలత ఇంట్లో ఈనెల 10న దొంగతనం జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి దొంగతనానికి పాల్పడిన కందుకూల దస్తగిరిని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

● షెడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని సిరిసిల్ల – కామారెడ్డి ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న భూమిలో సామూహిక గొర్రెల షెడ్ల నిర్మాణానికి యాదవ సంఘం మండల అధ్యక్షుడు మెండే శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం కింద మంజూరైన నిధులతో షెడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. యాదవ సంఘం ప్రతినిధులు శ్యాగ లక్ష్మణ్, రాజు, వరుకూటి రాజమల్లయ్య, వివిధ గ్రామాలకు చెందిన యాదవులు, గొర్రెల కాపరులు పాల్గొన్నారు.